క్లుప్తంగా

9 నుంచి 'పల్లెబాట'



మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమామణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో మంగళవారం సమావేశమైన ఆమె కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో సంక్షేమ పథకాల ద్వారా ఎంతమంది లబ్ధి పొందారు.. ఎంత లబ్ధి పొందారో తెలియజేయాలన్నారు. అలాగే గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు కూడా వివరించాలన్నారు. కార్యక్రమం చేసే ముందురోజు అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం వెచ్చిన ఖర్చు జాబితాను ప్రదర్శించాలని, ఆ మరుసటి రోజు ప్రతీ ఇంటికి వెళ్లి, వాటిని వివరించాలన్నారు.

డిప్యూటీ ఈవో సందర్శన



ప్రశ్నలడిగి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో బ్రహ్మాజీరావు

బొబ్బిలి: మండలంలోని చింతాడ గ్రామ పాఠశాలను డిప్యూటీ ఈవో పి.బ్రహ్మాజీరావు మంగళవారం సందర్శించారు. తొలుత ఆయన పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రుచి, శుచితో కలిగిన మధ్యాహ్న భోజనం రోజూ పిల్లలకు పెట్టాలన్నారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు గమనించారు.

భూ ఆక్రమణపై దర్యాప్తు



బూరాడలో భూ ఆక్రమణపై దర్యాప్తు చేస్తున్న తహసీల్దారు సుదర్శనరావు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న విషయంపై తహసీల్దారు సుదర్శనరావు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. భూమి ఆక్రమణకు గురికావడమే కాకుండా వేరే వ్యక్తుల పేరిట దానిని గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన కల్యాణచక్రవర్తి మార్చినట్లు సోమవారం జరిగిన జిల్లా స్పందనలో ఫిర్యాదు అందిందని, ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలతో దర్యాప్తు చేస్తున్నామని తహసీల్దారు తెలిపారు. తొలుత తహసీల్దారు ఆక్రమణకు గురైన భూమి వద్దకు చేరుకుని, రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ఆరాతీశారు. అలాగే ఫిర్యాదు చేసిన సమతా సైనికదళ్ ఇన్‌చార్జ్ తేగల మోహనరావు వద్ద నుంచి ఆధారాలు, వివరాలను సేకరించారు. తమ పరిశీలనలో గమనించిన విషయాలను కలెక్టర్‌కు తెలియజేస్తామని తహసీల్దారు తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు రాజేశ్వరరావు

బొబ్బిలి: ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పించాలని తహసీల్దారు డోల రాజేశ్వరరావు సూచించారు. స్థానిక పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో మంగళవారం సమావేశమైన ఆయన 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థులంతా ఓటర్లుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటుహక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాలని, వారి ఓటుహక్కు కోసం దరఖాస్తులు చేయించాలన్నారు.

నేడు మామిడిపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న ఖాళీ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ కోరారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు డోల రాజేశ్వరరావును మంగళవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామని, తహసీల్దారు హామీ ఇచ్చారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గజరాయునివలసలో గడప గడపకూ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



సంతకవిటి: మహిళకు సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గజరాయునివలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి తపన అని అన్నారు. ప్రతీ సచివాలయ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు కావాలన్నా, అభివృద్ధి పనులు జరగాలన్నా ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హుల వద్దకే పథకాలు, ప్రభుత్వ సేవలు వస్తున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైఎస్సార్ సీపీ నేతలు శంబంగి వేణుగోపాలనాయుడు, బొమ్మినాయుని వెంకటనాయుడు, జేసీఎస్ కన్వీనర్ శంకరరావు, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దారు అజురఫీజాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం: ఎమ్మెల్యే జోగులు

సంతకవిటి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లిట గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. కొంతమంది గ్రామస్తులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కార్యక్రమం ముగిసిన వెంటనే జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావుతో కలిసి గ్రామస్తుల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాలకు మేలు చేకూరాలన్న సదుద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మరో వైపు అభివృద్ధి పనులు కూడా జోరుగా చేయిస్తున్నారన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే 2024 ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ జగనన్నను సీఎంను చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఎరకమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జి.షణ్ముఖ, కె.సన్యాసినాయుడు, వి.రమణ, జి.జగన్మోహనరావు, జి.సురేష్, వై.రామకృష్ణ, ఐ.సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి:మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రాజాం: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్ వద్ద ఉన్న ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి, అక్కడ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు అందజేసేందుకు ప్రదర్శించిన మందులను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాలని కోరారు. దేశంలో ఎక్కడా ఇటువంటి కార్యక్రమం లేదని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పదో సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వైద్యారోగ్య సిబ్బందితో మాట్లాడి, అక్కడ అందిస్తున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు రోగులకు మందుల కిట్లు అందజేశారు.

నేడు తెర్లాంలో 'స్పందన'కు కలెక్టర్

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరగనున్న జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమానికి కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయంలో మండల స్థాయి నోడల్ అధికారులతో మంగళవారం సమావేశమై, ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను, ఇంతవరకు ఆయా శాఖలకు స్పందన ద్వారా వచ్చిన సమస్యలు ఎన్ని పరిష్కారమయ్యాయో, ఇంకా ఎన్ని సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయో తెలిపే వివరాలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల ప్రారంభం



రంగరాయపురంలో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనంతో పాటు రంగరాయపురం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే) భవనాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన సాధ్యమన్నారు. ప్రతీ గ్రామంలో ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, దాని పరిధిలోని వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతోందన్నారు. రైతు భరోసా పథకం కింద నియోజకవర్గంలోని 43 వేల మంది రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు రూ.81.59 కోట్ల నిధులు జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేత ఎస్.వేణుగోపాలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యు.అప్పలనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ టి.దామోదరరావు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, సర్పంచ్‌లు జి.అప్పారావు, యు.గోవింద, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.శ్రీరాములు, పీఆర్ డీఈఈ అప్పారావు, వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రైలునుంచి జారిపడి వృద్ధుడి దుర్మరణం



సత్యంనాయుడు మృతదేహం

ఏలూరు టౌన్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వంగపండు సత్యంనాయుడు(67) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటన ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి పట్టణానికి చెందిన సత్యంనాయుడు బొబ్బిలి నుంచి ఏలూరుకు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఏలూరు రైల్వేస్టేషన్‌లో రైలు ఆగి, తిరిగి బయలుదేరుతున్న సమయంలో ఆయన నిద్రమత్తులో రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయాడు. తోటి ప్రయాణికులు ఇది గమనించి, అతడిని బయటకు తీసే లోపే రైలు కదలడంతో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రైల్వేఎస్ఐ నరసింహారావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు మంగళవారం రాత్రి అప్పగించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం

రామభద్రపురం: ప్రభుత్వ నింబధనల ప్రకారమే ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. మండలంలోని ఆరికతోట గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఆమె మెంటాడ మండలంలో ఏర్పాటు చేయనున్న గిరిజన వర్సిటీ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన భూమి కోసం గ్రామ రైతులతో సమావేశమై, చర్చలు జరిపారు. ఆరికతోట రెవెన్యూ పరిధిలోని రైతులకు సంబంధించిన 98 సెంట్ల భూమి వర్సిటీ రోడ్డుకు అవసరమని, రైతులు భూమి ఇచ్చి, సహకరించాలని కోరారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ల్యాండ్ ఎక్విజియేషన్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనల మేరకు భూమి పోగొట్టుకుంటున్న రైతులకు పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎ.సులోచనరాణి పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు విడనాడాలి

రాజాం సిటీ: శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకుని, మూఢనమ్మకాలు విడనాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నీలయ్య అన్నారు. మండలంలోని కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్ సి.వి.రామన్ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం దేశవ్యాప్త శాస్త్ర ప్రచారోద్యమానికి శ్రీకారం చుట్టారు. 2024 ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరిగే ఈ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు.

రూ.1.94 కోట్లతో తాగునీటి కుళాయిలు

రేగిడి: మండలంలోని 13 గ్రామాల్లో రూ.1.94 కోట్ల వ్యయంతో జల్ జీవన్ మిషన్ పనుల ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉనుకూరులో ఇంటింటి కుళాయిలను పరిశీలించిన ఆయన రూ.5 లక్షల లోపు నిధులతో అప్పాపురం, బుడితిపేట, బొడ్డవలస, గడబపేట, చిన్నకోడిశ, రూ.5 లక్షల పైన నిధులతో మజ్జిరాముడుపేట, కొండలమామిడివలస, ఉనుకూరు, బూరాడ, కందిశ, బాలకవివలస, మునకలవలస, కోడిశ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులు చేయడం జరిగిందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

రాజాం: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశమైన ఆయన అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు.

14న సంక్షేమ పథకాల బోర్డు ఏర్పాటు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో ఈ నెల 14వ తేదీన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు తెలిపే బోర్డును ఏర్పాటు చేయనున్నామని ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పంచాయతీ ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఆయన ప్రతీ గ్రామ పంచాయతీలో పథకాలు, పథకాల లబ్ధిదారుల బోర్డులు ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందన్న విషయం అందరికీ తెలుస్తుందన్నారు.

బొబ్బిలి: మండలంలోని పారాది, మెట్టవలస గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన బోర్డులు ఈ నెల 9వ తేదీన ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీడీవో శ్యామలకుమారి అన్నారు. మండలంలోని బూరాడ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

పంటకోత ప్రయోగం

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో వరిపంట పొలాల్లో పంటకోత ప్రయోగం మంగళవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటపొలంలో 5 మీటర్ల పొడవు, వెడల్పు విస్తీర్ణంలో ఈ ప్రయోగం చేపట్టారు. ఎకరాకు 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు గుర్తించామని ఏవో మురళీకృష్ణ తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఆడిట్

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మండలానికి వచ్చిన సాధారణ నిధులు, 15వ ఆర్థికసంఘం నిధులు, ఖర్చులపై ఆడిటర్ ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఆడిట్ నిర్వహించారు. జిల్లా సహాయక ఆడిట్ ఆఫీసర్ సీహెచ్ ప్రభావతి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలో వివరించాలి

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ సన్నాహక సమావేశాల్లో పార్టీ నేతలు



తెర్లాం: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు



సంతకవిటి: ఎంపీపీ మంజు అధ్యక్షతన సమావేశమైన పార్టీ నేతలు

తెర్లాం: ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే మళ్లీ సీఎంగా ఎందుకు కావాలో ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన ఈ నెల 9వ తేదీ నుంచి చేపట్టనున్న వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. అలాగే గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలియజేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ సీఎంగా సీఎం జగనన్ననే గెలిపించాలని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్, వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, ఎంపీపీ ప్రతినిధి ఎన్.బాబ్జీరావు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 23వ తేదీ వరకు..

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ సిరిపురపు మంజు మంగళవారం సమావేశమై, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ నిర్వహణ, విజయవంతానికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ నెల 9వ తేదీన సంతకవిటిలో, 10న వాసుదేవపట్నం, 14న జావాం, 15న గోళ్లవలస, 16న గరికిపాడు, 17న తాలాడ, 20న కాకరాపల్లి, 21న మందరాడ, 22న జీఎస్‌పురం, 23న మోదుగులపేటలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా విచ్చేసి, ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించాలన్నారు. అలాగే గ్రామగ్రామాన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వం చేసిన మేలు చెప్పండి..

రామభద్రపురం: మండల కేంద్రంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మేంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు కలిసి, పార్టీ నేతలతో మంగళవారం సమావేశమై, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. తొలుత మండలంలో 10 సచివాలయాల పరిధిలో చేపట్టబోయే కార్యక్రమ షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ నెల 9న రామభద్రపురం సచివాలయం-1, 10న సచివాలయం-2, 14న సచివాలయం-3, 15న బూసాయవలస, 16న తారాపురం, 17న సోంపురం, 20న నాయుడువలస, 21న ఆరికతోట, 22న కొట్టక్కి, 23న జన్నివలస సచివాలయాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా ఇంటింటికీ వెళ్లి, ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన మేలును వివరించాలని వారు తెలిపారు.

బాడంగి: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతల సమావేశం మంగళవారం జరిగింది. ఈ నెల 9వ తేదీ నుంచి జరగబోయే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు కోరారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లినప్పుడు గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలియజేయాలన్నారు. అలాగే ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి కలిగిన భోజనం పెట్టాలి

- రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు



రాజాం: మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు కాంతారావు

రాజాం సిటీ: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు రుచి, శుచి కలిగిన భోజనం పెట్టాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు సూచించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న విద్యాబోధనను పరిశీలించారు. తొలుత మల్లిఖార్జునకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆయన వంటగదిలో లైట్లు లేకపోవడాన్ని గమనించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. చీకటిలో వంట వండడం, పిల్లలను ఉంచడం సరికాదని నిర్వాహకులను హెచ్చరించారు. ఇదే కేంద్రానికి సంబంధించిన ఇద్దరు కార్యకర్తలకు మెమోలు జారీచేయాలని పీవో కనకదుర్గకు ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టాక్ రిజిస్టర్‌తో పాటు సరుకుల నిల్వలను పరిశీలించారు. అలాగే పిల్లల కోసం వండిన ఆహారపదార్థాలను రుచిచూశారు. పనితీరు మెరుగుపర్చుకోవాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అక్కడి నుంచి రేషన్ షాపు వద్దకు వెళ్లి, ధరల పట్టిక, స్టాకు వివరాలు తెలిపే బోర్డు ఏర్పాటు చేయాలని డీలర్‌కు సూచించారు. పోలీస్‌స్టేషన్ రోడ్డు పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి వంటగదులు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. మరింత రుచికరంగా ఆహార పదార్థాలు వండాలని వంట నిర్వాహకులకు సూచించారు. వంటశాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు, బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్, 2 వసతిగృహాలను పరిశీలించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వంగర: మండలంలోని బాగెంపేట, అరసాడ, దేవకివాడ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, నాణ్యమైన విద్యనందించాలని, మంచి భోజనం విద్యార్థులకు పెట్టాలన్నారు.

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, వందానపేట, అంబకండి కాలనీ పాఠశాలలను ఎంఈవో ఎంపీ ప్రసాదరావు మంగళవారం సందర్శించి, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. వంటకాలు శుభ్రంగా ఉండాలని, రుచి కలిగేలా ఆహార పదార్థాలు వండిపెట్టాలన్నారు.

